ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
గురువారం 18 జనవరి 2024

నాలుగేళ్లుగా ప్రోత్సాహకం అందలేదు



3.5 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నా. 300 గుడ్ల వరకు మేపుతున్నాం. ఏళ్లుగా పంట సాగు చేస్తున్నా. కూలి ఖర్చులు, పెట్టుబడులు పెరగడంతో పంట గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం కూడా అందట్లేదు. నాలుగేళ్లుగా రూ.4 లక్షలదాకా ప్రోత్సాహక బకాయిలు రావాల్సి ఉంది. సమ్మెలోకి వెళ్తామనడంతో నా ఖాతాలోకి రూ.11500 జమ చేశారు. ఇది ఏ మూలకు చాలుతుంది? **- రాజప్ప, కదిరేపల్లి, అగళి మండలం**

మల్బరీని మరిచారు..!

పంట సాగు పెంపునకు తోడ్పాటు కరువు



- రైతులు, రీలర్లకు నాలుగేళ్లుగా అందని ప్రోత్సాహకాలు
- బకాయిలు చెల్లించాలంటూ సమ్మెబాట
- కొంత విదిల్చి.. సద్దుమణిచే ప్రయత్నం..



తమది రైతు ప్రభుత్వమని వైసీపీ పాలకులు పదేపదే గొప్పలు చెబుతుంటారు. ఎన్నెన్నో చేస్తున్నామంటూ ప్రగల్భాలు పలుకుతుంటారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. నాలుగేళ్లుగా పట్టు రైతులకు కనీసం ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడం శోచనీయం. దీనిని బట్టి రైతుల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రోత్సాహక బకాయిలు రూ.కోట్లలోకి చేరిపోయాయి. పట్టు రీలర్లకు సైతం ప్రోత్సాహకాల చెల్లింపునకు ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. వారి బకాయిలు కూడా రూ.కోట్లలోకి చేరిపోయాయి. బకాయిలు చెల్లించాలని రైతులు, రీలర్లు.. అధికారుల చుట్టూ పదేపదే ప్రదక్షిణ చేస్తున్నారు. అయినా ఫలితం లేదు. తమ గోడు వినేవారులేరు. దీంతో చేసేదిలేక తమకు రావాల్సిన ప్రోత్సాహక బకాయిలు పూర్తిగా చెల్లించాలంటూ బుధవారం నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. సమ్మెకు పిలుపివ్వడంతో అప్రమత్తమైన ప్రభుత్వం ప్రోత్సాహక బకాయిల్లో కొంత విదిల్చి.. సమ్మెను అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. ఏళ్లుగా బకాయిలు పెండింగ్ ఉండగా.. నెలల ప్రోత్సాహకాలు ఇవ్వడంపై రైతులు, రీలర్లు మండిపడుతున్నారు. - మడకశిర

పంట సాగు విస్తీర్ణం పెంచేందుకు..

మల్బరీ సాగు తొలిరోజుల్లో రైతులకు లాభాలు కురిపించింది. రానురాను లాభాలు తగ్గుతూ వచ్చాయి. పంట సాగుకు అధిక సంఖ్యలో కూలీలు అవసరం. కూలీ రేట్లు విపరీతంగా పెరగడం, పెట్టుబడులు అధికమవడంతో పంట నష్టాల్లోకి జారుకుంది. సాగు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. దీనిని గమనించిన అప్పటి ప్రభుత్వాలు పంట సాగు పెంపునకు బైవోల్టీన్ రకం పట్టుగూళ్లు పండించిన రైతులకు కిలోపై రూ.50 ప్రోత్సాహకం ప్రకటించాయి. ఆ మేరకు మార్కెట్‌లో పంట అమ్మిన మూడు, నాలుగు నెలల్లోగా రైతుల ఖాతాల్లో ప్రోత్సాహకం జమ చేసేవారు. పట్టుగూళ్ల నుంచి దారం తీసే రీలర్లకు సైతం ప్రభుత్వం కిలోపై రూ.30 నుంచి రూ.150 దాకా ప్రోత్సాహకం అందిస్తోంది. వైసీపీ అధికారం చేపట్టాక ప్రోత్సాహకం ఊసే మరిచారు. నాలుగేళ్లుగా పట్టు రైతులకు ప్రోత్సాహకమే చెల్లించలేదు. దీంతో బకాయిలు భారీగా పేరుకుపోయాయి. రైతులకు చెల్లించాల్సిన ప్రోత్సాహక బకాయిలు రూ.17 కోట్లకు చేరుకున్నాయి. రీలర్ల బకాయిలు రూ.4 కోట్లు దాటాయి.



పురం మార్కెట్‌కు రూ.5 టన్నులదాకా పట్టుగూళ్లు

పట్టుగూళ్ల విక్రయానికి హిందూపురం మార్కెట్ ఎంతో ప్రసిద్ధి. ఇతర జిల్లాల నుంచి సైతం ఈ మార్కెట్‌కు రైతులు పట్టుగూళ్లను తీసుకొస్తారు. రోజూ 5 టన్నులదాకా పట్టుగూళ్లు వస్తుంటాయి. జిల్లాలో 26186 మంది రైతులు 45828 ఎకరాల్లో మల్బరీ తోటలు సాగు చేస్తున్నారు. రెండేళ్ల క్రితం పట్టుగూళ్ల ధరలు పడిపోయాయి. దిగుబడులు కూడా అంతంతమాత్రంగానే వచ్చాయి. పండించిన అరకొర దిగుబడి పట్టుగూళ్లకు ధరలు లేక పెట్టిన ఖర్చులు కూడా చేతికందలేదు. దీంతో అప్పట్లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం కూడా అందలేదు. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉన్నా.. దిగుబడులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా పంటలు దెబ్బతిని పెట్టిన ఖర్చులు కూడా అందడంలేదు. ప్రభుత్వం ప్రోత్సాహకమైనా ఇస్తే పంట సాగు పెంపుదలకు ఉపయోగపడుతుందని రైతులు పేర్కొంటున్నారు. మార్కెట్‌లో విక్రయించే ప్రతి కిలో బైవోల్టీన్ పట్టుగూళ్లకు ప్రభుత్వం రూ.50 చొప్పున ప్రోత్సాహకం అందిస్తోంది. గతంలో పట్టుగూళ్లు విక్రయించిన రెండు, మూడు నెలలకు రైతులకు ప్రోత్సాహకం అందేది. ప్రస్తుతం ప్రోత్సాహకం అందక నాలుగేళ్లవుతోంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పట్టు పురుగులను మేపుతున్న దృశ్యం



దిగుబడి వచ్చిన బైవోల్టీన్

రైతులకు రూ.17 కోట్ల బకాయిలు

హిందూపురం మార్కెట్ పరిధిలో 5 వేలమంది పట్టు రైతులకు రూ.17 కోట్లదాకా ప్రోత్సాహకాలు చెల్లించాల్సి ఉంది. 300 మంది రీలర్లకు రూ.4 కోట్లదాకా ఇవ్వాల్సి ఉంది. బకాయిలు చెల్లించాలంటూ బుధవారం నుంచి నిరవధిక సమ్మెలోకి పట్టు రైతులు, రీలర్లు వెళ్లారు. సమ్మె పిలుపుతో అప్రమత్తమైన ప్రభుత్వం రైతులకు రెండు పంటలకు, రీలర్లకు 8 నెలలకు సంబంధించి ప్రోత్సాహకాన్ని నాలుగు రోజుల క్రితం వారి ఖాతాల్లోకి జమ చేసింది. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేస్తున్నారు.

ధరలు, దిగుబడి అంతంతమాత్రమే..



ఐదెకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నా. ఈ ఏడాది దిగుబడి అంతంతమాత్రమే. ధరలు కూడా ఆశాజనకంగా లేవు. దీంతో నష్టాలు తప్పేలా లేవు. ప్రభుత్వం నుంచి నాలుగేళ్లుగా ప్రోత్సాహకం అందలేదు. రూ.4 లక్షలదాకా బకాయిలు రావాల్సి ఉంది. పట్టుగూళ్ల ధరలు పెంచి, ప్రోత్సాహకాలను పూర్తిస్థాయిలో చెల్లించి, ఆదుకోవాలి.

- రాజన్న, హులికెర దేవరహళ్లి, అగళి మండలం

రూ.17కోట్ల పోత్సాహకాలు అందాల్సి ఉంది

హిందూపురం మార్కెట్‌లో బైవోల్టీన్ పట్టుగూళ్లను విక్రయించిన రైతులకు ప్రోత్సాహకం కింద రూ.17 కోట్లదాకా చెల్లించాల్సి ఉంది. 300 మంది రీలర్లకు రూ.4 కోట్లదాకా బకాయి ఉంది. మూడు రోజుల క్రితం ప్రభుత్వం 8 నెలలకు సంబంధించి రీలర్లకు, రెండు పంటలకు సంబంధించి రైతులకు ప్రోత్సాహకాల బకాయిలు ఖాతాల్లోకి జమ చేసింది.

- లక్ష్మీరెడ్డి, పట్టుగూళ్ల మార్కెట్ అధికారి, హిందూపురం

శత వసంతాల బామ్మ

పోలే నరసమ్మకు వందేళ్లు పూర్తి

- నూటొక్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన కుటుంబ సభ్యులు



పోలే నరసమ్మ

నల్లమాడ, జనవరి 17: మండలంలోని తిప్పయ్యగారిపల్లికి చెందిన పోలే నరసమ్మకు బుధవారం నాటికి వందేళ్లు పూర్తయ్యాయి. నూటొక్క జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆమెకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు సంతానం. మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవళ్లు, ముని మనవరాళ్లు కలిసి జన్మదిన వేడుకలు జరిపారు. ఆమె వయసు వందేళ్లు పూర్తయినా ఇప్పటికీ ఉత్సాహంగా ఉంటారనీ, ఇంటిపనులతోపాటు వంట పనులు చకచకా చేస్తారని కుటుంబసభ్యులు తెలిపారు. ఆమె మనవళ్లు, మునిమనవళ్లు వారి పిల్లలు అంతా కలిసి సుమారు 50 మంది దాకా ఉన్నట్లు చెప్పారు.

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి
- అమడగూరులో జయహో బీసీ సదస్సు
- పల్లె ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

టీడీపీతోనే బీసీలకు అధికారం



మాట్లాడుతున్న బీకే పార్థసారథి


అమడగూరు, జనవరి 17: బీసీలకు అధికారం కల్పించింది టీడీపీయేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. అంతకుముందు చౌడేశ్వరీ దేవికి పూజలు చేశారు. అనంతరం అమడగూరు, కసముద్రం, మహమ్మదాబాద్, జెకెపల్లి, కొట్టువారిపల్లి, తుమ్మల, పూలకుంటపల్లి, గుండువారిపల్లి, చీకిరేవుపల్లి పంచాయతీల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అమడగూరులో బస్టాండులో నిర్వహించిన సదస్సులో బీకే పార్థసారథి మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి



బైక్ ర్యాలీ...

బీసీలకు రక్షణ కరువైందని, వారికి రక్షణ కల్పించే దిశగా భరోసా ఇచ్చేందుకు జయహో బీసీ కార్యక్రమం చేపట్టామన్నారు. బీసీలను అసెంబ్లీకి తీసుకెళ్లిన ఘనత ఎన్టీఆర్, చంద్రబాబుదే అన్నారు. అగ్రవర్ణాల చేతిలో బీసీలు అంతమవుతున్న రోజుల్లో టీడీపీ రిజర్వేషన్లు కల్పించిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి వాటిని ఎత్తేసి, అన్యాయం చేశారన్నారు. పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి, ప్రజలకు నరకం చూపించిందన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే ప్రతిఒక్కరూ ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుందన్నారు. టీడీపీ బీసీలను ఏరోజూ వేరు చేసి చూడలేదన్నారు. రాజశేఖర్‌రెడ్డిగానీ, జగన్మోహన్‌రెడ్డిగానీ బీసీలకు న్యాయం చేసిన దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి నియోజకవర్గంలోని 103 చెరువులను నీటితో నింపుతామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారనీ, నేటికీ ఒక్కదానికీ నీరిచ్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, బీసీ సాధికరత జిల్లా అధ్యక్షుడు రంగయ్య, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, జనసేన జిల్లా కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, టీడీపీ నేతలు సామకోటి ఆదినారాయణ, వడ్డె వెంకట్, కొల్లకుంట అంజినప్ప, శ్యామ్‌బాబు నాయుడు, ఒలిపి సోమశేఖర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నం పెట్టే రైతులకు వేధింపులు



హిందూపురం మార్కెట్‌లో పట్టు గూళ్లు లేక ఖాళీగా క్రేట్లు

- పాలకులు వాగ్దానాలు నెరవేర్చాలి
- రైతు సంఘం నేతల డిమాండ్
- సమ్మెలోకి మల్బరీ రైతులు, రీలర్లు
- పట్టుగూళ్ల మార్కెట్లు వెలవెల



హిందూపురం మార్కెట్‌లో సమ్మె చేపట్టిన పట్టు రైతులు, రీలర్లు

హిందూపురం అర్బన్/ధర్మవరం, జనవరి 17: అందరికీ అన్నంపెట్టే రైతులను ప్రస్తుతం వేధిస్తున్నారని రైతు సంఘం నేతలు మండిపడ్డారు. పట్టు రైతులకు ప్రోత్సాహకం ఇవ్వకపోవడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. తమకు అందాల్సిన ప్రోత్సాహకాల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ పట్టు రైతులు, రీలర్లు బుధవారం నిరవధిక సమ్మె చేపట్టారు. హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్ ఎదురుగా సమ్మె శిబిరం ఏర్పాటు చేశారు. పట్టు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి పట్టు రైతులకు ప్రోత్సాహకం ఇచ్చిందిలేదన్నారు. ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే పట్టు రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటానని నమ్మించి, మోసం చేశాడన్నారు. రైతులకు దగా చేసిన పాలకపక్షంగా వైసీపీ నిలిచిపోతుందన్నారు. మంత్రులు, పాలకపక్ష పెద్దలకు ఎన్నిసార్లు విన్నవించినా.. రైతులపై కనికరం చూపలేదన్నారు. ప్రోత్సాహకం ఇచ్చేవరకు పట్టు మార్కెట్ సమ్మె ఆపేది లేదని ఉద్ఘాటించారు. బుధవారం రైతులు పట్టుగూళ్లను తీసుకురాకపోవడంతో మార్కెట్ వెలవెలబోయింది. క్రేట్లు ఖాళీగా కనిపించాయి.



ధర్మవరంలోని సెరికల్చర్ కార్యాలయం వద్ద బైఠాయించిన పట్టు రైతులు, రీలర్లు

ధర్మవరంలో..

పట్టణంలోని సెరికల్చర్ కార్యాలయం వద్ద పట్టు రైతులు, రీలర్లు సమ్మె చేపట్టారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్‌బాషా సంఘీబావం ప్రకటించారు. జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ.. పట్టురైతులకు ప్రోత్సాహక బకాయిలు వెంటనే ఇవ్వాలన్నారు. హామీలు అమలుచేయడం చేతకానప్పుడు ఎందుకు గుప్పించారని జగన్‌ను ఆయన ప్రశ్నించారు.

సమస్యలు పరిష్కరించే దాకా

పోరాడతాం

- స్పష్టం చేసిన అంగన్‌వాడీలు
- 37వ రోజుకు చేరిన సమ్మె

సీడీపీఓ కార్యాలయంలో షోకాజ్ నోటీసుకు బదులు నోటీసులిస్తున్న సిబ్బంది



పుట్టపర్తి రూరల్, జనవరి 17: తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం ఆపేదిలేదని అంగన్వాడీ సిబ్బంది స్పష్టం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లావ్యాప్తంగా వారు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 37వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు ప్రాజెక్టు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధులకు హాజరుకాకపోవడంపై సమాధానం చెప్పాలంటూ ప్రభుత్వం అందజేసిన షోకాజ్ నోటీసులకు బదులు నోటీసులను జిల్లాకేంద్రంలో సీడీపీఓ గాయత్రికి అందజేశారు. అంతకుమునుపు స్థానిక హనుమాన్ కూడలి నుంచి సీడీపీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తమ సమస్యలు తీరేవరకు పోరాటం ఆపమన్నారు. అవసరమైతే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరాహారదీక్షలు, రాస్తారోకోలు, రాష్ట్రబంద్‌కు కూడా పిలుపునిస్తామని హెచ్చరించారు. వారికి సీఐటీయూ నాయకులు ఈఎస్ వెంకటేసు, అంజి తదితరులు మద్దతు ఇచ్చారు. జిల్లాలో ముదిగుబ్బ, ఎన్పీకుంట, కదిరి, ఓడీసీ, నల్లమాడ, హిందూపురం, అగిలి, నల్లమాడ, ధర్మవరం, బత్తలపల్లి, హిందూపురం,పెనుకొండ, గోరంట్లలలో అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు జిల్లా కార్యదర్శి నాగమణి, పుట్టపర్తి ప్రాజెక్టు అధ్యక్షురాలు సుజాత, నేతలు పాల్గొన్నారు.



పుట్టపర్తిలోని హనుమాన్ కూడలిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

20న నవోదయ ప్రవేశ పరీక్ష



కొత్తచెరువు, జనవరి 17: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి ప్రవేశానికి ఈనెల 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి (డీఈఓ) మీనాక్షి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులు అర్హులన్నారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారు కేటాయించిన కేంద్రాల్లో పరీక్షలకు హాజరుకావాలని డీఈఓ కోరారు.

గ్రామాలకు ఆగిన శ్రీరామిరెడ్డి నీరు

120 మంది కార్మికులు వేతనాలు, పీఎఫ్ కోసం ఎదురుచూపు

నేడు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కార్యాలయం ముట్టడికి పిలుపు



మూతపడ్డ శ్రీరామిరెడ్డి తాగునీటి పంపుహౌస్

కళ్యాణదుర్గం, జనవరి 17: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికుల ఆందోళన ఉధృతం అవుతోంది. గత 17 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదు. ఈక్రమంలోనే బుధవారం పంప్‌హౌస్‌కు తాళాలు వేశారు. ఫేజ్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 120 మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. దీంతో సుమారు 224 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. 15 ఏళ్లుగా ఈ పథకంలో పనిచేస్తున్నామని, నెలనెలా జీతాలు, ఇతరత్రా ప్రయోజనాలు కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు వాపోయారు. జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు తూతు మంత్రంగా చర్చలు జరిపి రెండు నెలల జీతాలు మాత్రమే మంజూరు చేశారు. మిగిలిన మూడు నెలల జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. గత ఏడాది మార్చి నుంచి పీఎఫ్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కార్యాలయాన్ని గురువారం ముట్టడించి, ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

శ్రీరామిరెడ్డి కార్మికులపై క్రిమినల్ కేసులు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఉరవకొండ, జనవరి 17: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పైప్‌లైన్లు పగులగొట్టారంటూ అధికారులు ఈ నెల 14న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో 427, 431 సెక్షన్ కింద కార్మికులు ప్రకాష్, రాము, అశోక్, లక్ష్మీనారాయణ, గణేష్, సంజప్ప పై పోలీసులు కేసు నమోదు చేశారు.

విచారణ చేయకుండా కేసు ఎలా నమోదు చేస్తారు: కార్మికులు

ఏదైనా సంఘటనకు సంబంధించి విచారణ చేయకుండా కేసులు ఎలా నమోదు చేస్తారని పోలీసులను కార్మికులు బుధవారం ప్రశ్నించారు. జీతాలు అడిగినందుకు, పైపులు పగులగొట్టారని ఆరుగురు కార్మికులపై కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. దౌర్జన్యానికి పాల్పడిన అధికారులు, అధికారపార్టీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు కాపీ అందజేస్తుండగా తీసుకోవడానికి వారు నిరాకరించారు. దీంతో కార్మికులు రోడ్డుపై బైఠాయించేందుకు ప్రయత్నించగా హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదును స్వీకరించారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ సమ్మెలో ఉంటే తమపై అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. అవగాహన లేకుండా సొల్లాపురం సర్పంచు భర్త భాస్కర్ రెడ్డి, అధికారులు మోటార్లు రన్ చేయడం వల్ల పైపులు పగిలిపోయాయన్నారు. వారిపై కేసు నమోదు చేయకుండా, తమపై కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తమను కులం పేరుతో దూషించిన సొల్లాపురం సర్పంచు భర్త భాస్కర్‌రెడ్డి, ఈఈ జవహర్‌కుమార్, డీఈ శ్రీనివాసులుపై కేసు నమోదు చేయాలన్నారు.

బిల్లులెందుకు చేయరు..?

- నిధులు ఎందుకు ఇవ్వరు..?
- జడ్పీలో అధికారులపై ప్రశ్నల వర్షం
- తాగునీటి పథకాల సప్లిమెంటరీ అగ్రిమెంట్‌పై రభస
- అగ్రిమెంట్ రద్దుకు తీర్మానం చేస్తామన్న చైర్ పర్సన్
- విచారణ చేయిస్తామన్న కలెక్టర్ గౌతమి





జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం కలెక్టర్ గౌతమి, వేదికపై చైర్ పర్సన్ గిరిజమ్మ, హాజరైన ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు

అనంతపురం విద్య, జనవరి 17: తాగునీటి సమస్య, టెండర్లు, అధికారుల అవినీతి వ్యవహారాలు జడ్పీ సర్వసభ్య సమావేశంలో వేడిని పెంచాయి. ఎంతసేపు అడిగినా మైక్ ఇవ్వకపోవడంతో అధికార పార్టీ సభ్యులు కొందరు అలిగి బయటకు వెళ్లారు. తన మండలంలో అభివృద్ధి జరగలేదని, నిధులు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని విపక్ష సభ్యుడు నిరసన తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగంపై పాలకవర్గ సభ్యులు ప్రశ్నలతో దాడి చేశారు. అధికారులు నీళ్లు నమిలారు. తాగునీటి పథకాల నిర్వహణకు సంబంధించిన సప్లిమెంటరీ అగ్రిమెంట్, వాటర్ వర్క్స్ ఆపరేట్ అండ్ మెయింటేనెన్స్ (ఓఅండ్ఎం) బిల్లుల చెల్లింపుపై చర్చ తీవ్రస్థాయిలో సాగింది. సుమారు గంట పాటు జడ్పీచైర్ పర్సన్, సభ్యులు అడిగే ప్రశ్నలకు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ, జడ్పీ సీఈఓ సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. కేవలం మూడున్నర గంటలు సాగిన సమావేశానికి ఎమ్మెల్యేలు నలుగురు మాత్రమే వచ్చారు. మెజార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు గైర్హాజరయ్యారు.

● అధికార పార్టీ సభ్యుల ఆగ్రహం.. అలకలు

అధికార పార్టీ జడ్పీటీసీలు అధికారుల తీరుపై పరోక్షంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. బుక్కరాయసముద్రం జడ్పీటీసీ భాస్కర్ మాట్లాడుతూ, జడ్పీ నిధులు కూడా జడ్పీటీసీలకు దక్కడంలేదని, జడ్పీ గ్రాంట్ పనులకు కూడా పంచాయతీ, మండల పరిషత్ నుంచి తీర్మానాలు తేవాలని చెప్పడం అన్యాయమని అన్నారు. ఇది జడ్పీ సీఈఓ తమను చిన్నచూపు చూడటమేనని ఆవేదన వ్యక్తం చేశారు. కంబదూరు జడ్పీటీసీ నాగరాజు సైతం తీర్మానాల అంశంపై పెదవి విరిచారు. చేసిన పనులకు బిల్లులు కూడా కావడం లేదని, ఆఖరికి వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నామని కదిరి ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీటీసీలు, ఎంపీపీలు ఎవరన్నా భయం లేకుండా పోయిందని, జడ్పీలో ఏం జరుగుతోందని జడ్పీ ఉన్నతాధికారులపై మండిపడ్డారు. సభ్యులంటే లెక్కలేదని పరోక్షంగా జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓపై మండిపడ్డారు. ఫోన్లు చేసి అడిగితే బిల్లులు మరింత ఆలస్యం చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మాట్లాడేందుకు పలుమార్లు మైక్ అడిగినా ఎవరూ ఇవ్వకపోవడంతో యల్లనూరు జడ్పీటీసీ భోగాతి ప్రతాప్‌రెడ్డి సీట్‌లోంచి లేచి ఆగ్రహం వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోయాజారు. మైక్ అడిగినా ఇవ్వకుంటే ఎలా అని మండిపడ్డారు. తర్వాత సభాధ్యక్షులు గిరిజమ్మ కలుగజేసుకోగా, సిబ్బంది మైక్ ఇచ్చారు. ఓ అండ్ ఎం బిల్లులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారని ప్రతాప్ రెడ్డి మండిపడ్డారు. ఏమాత్రం సీనియారిటీ పాటించడం లేదని అన్నారు. రెండేళ్ల కిందట బిల్లలను కాదని, ఆరు నెలల కిందట వచ్చిన బిల్లలను ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. యల్లనూరు మండలంలో సుమారు రూ.36 లక్షల వరకూ పెండింగ్ పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓఅండ్ఎం బిల్లులు చెల్లింపులో సీనియారిటీ పాటించకపోవడంపై సభ్యుల ఆగ్రహం నేపథ్యంలో కలెక్టర్ కలుగజేసుకున్నారు. తాగునీటి బిల్లులు కీలకమని, వాటిని ఆపలేమని అన్నారు. ముందు పంపిన బిల్లులకు చెల్లింపు జరగాల్సి ఉందని, బిల్లుల చెల్లింపుపై ప్రాధాన్యత పాటించేలా లిస్టులు చూస్తామని, అదనపు ఫండ్స్ కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని, రాగానే చెల్లిస్తామని తెలిపారు.

మాపై వివక్ష ఎందుకు..? : టీడీపీ జడ్పీటీసీ ఉమేష్



సభ ప్రారంభం కాగానే అగళి జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్ మాట్లాడారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం 90 రోజుల్లో నిర్వహించాల్సిన సమావేశాన్ని 136 రోజులు దాటినా నిర్వహించకుంటే తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. తన మండలానికి ఇప్పటి వరకూ నిధులు ఇవ్వలేదని, ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి లేనప్పుడు రాజీనామా చేయడమే నయమని అన్నారు. దీంతో వైసీపీకి చెందిన లేపాక్షి, బుక్కరాయసముద్రం, శెట్టూరు, గుడిబండ జడ్పీటీసీలు, బెళుగుప్ప ఎంపీపీ ఆయనను చుట్టుముట్టారు. 'రాజీనామా చేయమని ఎవరు అడిగారు..? సమస్యలపై మాత్రమే మాట్లాడండి' అంటూ జడ్పీ సిబ్బందితో కలిసి వైసీపీ జడ్పీటీసీ సభ్యులు మైక్ లాక్కోబోయారు. జడ్పీ చైర్ పర్సన్ కలుగుజేసుకుని, అభివృద్ధికి నిధుల కోసం అంచనాలతో లేఖ ఇవ్వాలని, పరిశీలిస్తామని, అన్ని మండలాలు సమానమేనని అన్నారు. దీంతో టీడీపీ జడ్పీటీసీ శాంతించారు.



టీడీపీ జడ్పీటీసీని చుట్టుముట్టిన వైసీపీ జడ్పీటీసీలు

● సప్లిమెంటరీ అగ్రిమెంట్‌పై గరం గరం

ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్స్‌పై చర్చ ఆరంభం కాగానే జిల్లాలోని పలు తాగునీటి పథకాల్లోని ఫిల్టర్ బెడ్స్‌ను ఎందుకు మార్చలేదని జడ్పీ చైర్‌పర్సన్ ఆ శాఖ ఎస్ఈ ఎహసాన్ బాషాపై ఫైర్ అయ్యారు. రెండేళ్లుగా పది ఇరవై సార్లు చెప్పినా పట్టించుకోరా అని నిలదీశారు. కలుషిత నీరుతాగి ప్రజలు ఏం కావాలి..? ఎందుకు టెండర్లు పిలవలేదు..? అని ప్రశ్నించారు. టెండర్లు పిలిచినా ఎవరూ రాలేదని ఆయన సమాధానమిచ్చారు. దీంతో గత కలెక్టర్, జడ్పీ సీఈఓ చెప్పినా నామినేషన్ కింద ఎందుకు ఆ పనులు చేయలేదని చైర్ పర్సన్ మండిపడ్డారు. తాగునీటి పథకాల అగ్రిమెంట్ గడువు ముగిసినా ఎందుకు టెండర్లు పిలవలేదని ప్రశ్నించారు. దీంతో ఎస్ఈ నీళ్లు నమిలారు. గతంలో సస్పెండై వెళ్లిపోయిన జడ్పీ సీఈఓ పేరిట సప్లిమెంటరీ అగ్రిమెంట్ ఎలా చేస్తారని, ఇందులో ఎన్ని లక్షల అవినీతి జరిగిందని ప్రశ్నించారు. దీంతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కొన్ని తాగునీటి పథకాల సప్లిమెంటరీ అగ్రిమెంట్ చేసి, ధర్మవరం, ముదిగుబ్బ, గుత్తి, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు పరిధిలోని మరికొన్ని పథకాలను పక్కన ఎలా పెడతారని ప్రశ్నించారు. లక్షల డబ్బులు ముడుపులు ముడితే.. చేస్తారా..? మిగిలినవి పట్టించుకోరా...? అంటూ ఫైర్ అయ్యారు. జడ్పీచైర్ పర్సన్‌తోపాటు పలువురు జడ్పీటీసీలు కూడా మైక్ అందుకోవడంతో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ, జడ్పీ సీఈఓ సమాధానం చెప్పలేకపోయారు. నిబంధనలకు విరుద్ధంగా చేసిన అగ్రిమెంట్‌ను రద్దు చేస్తున్నామని, కొత్తగా సీఈఓ విచారణ చేసి అగ్రిమెంట్ చేస్తారని పాలకవర్గం తీర్మానం చేస్తుందని అధ్యక్షులు ప్రకటించారు. దీనిపై కలెక్టర్ గౌతమి కలుగజేసుకుని, వీటిపై విచారణ జరుగుతోందని, రిపోర్టు వస్తుందని తెలియజేశారు. మళ్లీ జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీటీసీ సభ్యులు మైకులు అందుకుని సప్లిమెంటరీ అగ్రిమెంట్‌ను రద్దుచేస్తున్నట్లు తీర్మానం చేస్తామని స్పష్టం చేశారు. ఇలా సుమారు గంట సేపు సప్లిమెంటరీ అగ్రిమెంట్‌పై హీట్ కొనసాగింది. ఈ అంశం జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీటీసీలు వర్సెస్ జడ్పీ సీఈఓ, కలెక్టర్ అన్నట్లుగా చర్చ సాగింది.

● వచ్చింది నలుగురు ఎమ్మెల్యేలే..

ఉమ్మడి జిల్లా నుంచి జడ్పీ సమావేశానికి నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు.హాట్ హాట్ డిబేట్ తర్వాత రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడారు. రాప్తాడు నియోజవకర్గం పరిధిలో రూ.2.92 కోట్ల టెండర్ల పనుల పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఇతర పెండింగ్ పనులు కూడా పురోగతి సాధించేలా చూడాలని అధికారులను కోరారు. తాగునీటి పనులకు గతంలో ప్రభుత్వం నుంచి డబ్బులు తెప్పించేవారని, ఈ ఏడాది జడ్పీ నుంచి అత్యవసరంగా వాడినట్లు స్పష్టమవుతోందని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. సత్యసాయి, శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్‌కు జడ్పీ నుంచి వాడుకున్న రూ.5 కోట్లు లేదా రూ.6 కోట్ల నిధులను మళ్లీ జడ్పీకి ప్రభుత్వం నుంచి వచ్చేలా ప్రభుత్వానికి ఒక తీర్మానం పంపాలని సూచించారు. జడ్పీ సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎప్పటికప్పుడు జడ్పీచైర్ పర్సన్‌కు అన్ని విషయాలు చెప్పాలని సూచించారు. మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీళ్లు ఇవ్వాలని పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ కోరారు. కదిరి నియోజకవర్గంలో ఆరు నెలల నుంచి సుమారు 3600 ఎకరాలకు 2590 మంది రైతులు అసైన్‌మెంట్ పట్టాల కోసం వేచి చూస్తున్నారని కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి అన్నారు. ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయని, ఎన్నికల కోడ్‌లోపు రైతులకు భూములకు పట్టాలు వచ్చేలా చూడాలని కోరారు. అనంతరం పంచాయతీ రాజ్, ఆర్ అండ్‌బీ తదితర అంశాలపై చర్చించారు.

అన్న వేసిన అభివృద్ధి బాటలు..

తూమకుంట పారిశ్రామిక వాడకు శ్రీకారం

నేడు వేల మందికి ఉపాధి

ఈ ప్రాంతంతో నందమూరి కుటుంబానికి విడదీయరాని బంధం

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

పెద్దఎత్తున అన్నదానానికి ఏర్పాట్లు

హిందూపురం, జనవరి 17: ఎన్టీఆర్ లోకం విడిచి 26 ఏళ్లవుతున్నా ఇప్పటికీ ఆయన పేరు ఇక్కడ తరిస్తూనే ఉంటారు. ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేసింది ఆయనే. ఎన్టీఆర్ ఇక్కడ పుట్టలేదు, పెరగలేదు అయినా హిందూపురంతో ఆ కుటుంబానికి ఉన్న బంధం అలాంటిది. అప్పట్లో నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవల కారణంగానే ఇప్పటికీ అన్న పేరును జపిస్తుంటారు. సంక్షేమాంధ్రకు నిలువెత్తు చిరునామా అన్న ఎన్టీఆర్. సంక్షేమ పథకాలతోపాటు పాలన సంస్కరణలతో కొత్త శకానికి నాంది పలికారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారం చేజిక్కించుకున్న ఘనుడు. ఆయన పుట్టింది క్రిష్ణాజిల్లాలో అయినా హిందూపురానికి నందమూరి కుటుంబంతో విడదీయరాని బంధం ఏర్పడిందని చెప్పవచ్చు. దేశ రాజకీయాలకు కేంద్రబిందువుగా రాజకీయ ఉద్దండులను, స్వాతంత్ర్య సమరయోధులను అందించిన గడ్డగా హిందూపురానికి పేరుంది. హిందూపురం అంటే గుర్తుకొచ్చేది నందమూరి పురం. మహానటుడు నందమూరి తారక రామారావు టీడీపీని స్థాపించి ఇక్కడి నుంచే మూడుసార్లు పోటీచేసి తిరుగులేని విజయం సాధించారు. రెండుమార్లు ముఖ్యమంత్రి పదవిని అధిరోహించారు. రాష్ట్రంలోనే వెనుకబడిన ఉమ్మడి అనంత జిల్లా. హిందూపురం రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో ఇక్కడ అభివృద్ధి చెప్పనక్కర్లేదు. అలాంటి పరిస్థితుల్లో హిందూపురాన్ని ఎన్టీఆర్ ఎంచుకుని పోటీచేశారు. ఆయనకు నియోజకవర్గ ప్రజలు తిరుగులేని ఆధిక్యాన్ని కట్టబెట్టారు. దీంతో ఎలాగైనా నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం తీసుకురావాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

ఎన్నో గుర్తుండిపోయాయి..

పురం నియోజకవర్గంలో విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలకు పెద్దపీట వేశారు. లేపాక్షిలో నవోదయ, ఏపీఆర్ఎస్, మలుగూరు, కొడిగెనహళ్లిలో ఏపీఆర్ఎస్ పాఠశాలలు ఏర్పాటు చేసి, నిరుపేదలకు ఉన్నత విద్య అందించారు. ఈ విద్యాసంస్థల్లో చదివి ఎంతో మంది ఉన్నత శిఖరాలను అధిరోహించారు. జిల్లాలో నిరుద్యోగ సమస్య పరిష్కరించాలనే ఉద్దేశంతో తూమకుంట వద్ద పారిశ్రామిక వాడ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అది నేడు భారీ పారిశ్రామిక వాడగా గుర్తింపు పొందింది. పట్టణ పరిధిలోని మోడల్‌కాలనీ, ఆటోనగర్ స్థాపించడంలో ఎన్టీఆర్ భూమిక మరువలేనిది. ఎంజీఎం క్రీడామైదానంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసింది కూడా ఎన్టీఆరే. హిందూపురంలోని ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా మార్చి, స్థానిక ఎమ్మెల్యే చైర్మన్‌గా ఉండాలనే సంకల్పంతో అప్పట్లో ప్రత్యేక జీఓ తీసుకొచ్చారంటే ఈ ప్రాంతంపై ఎంత మక్కువ ఉందో అర్థం చేసుకోవచ్చు. నియోజకవర్గంలో గూడులేని ప్రతి నిరుపేదకు పక్కా ఇల్లు నిర్మింపజేసి మారుమూల గ్రామాలకు సైతం రోడ్లను విస్తరించింది ఎన్టీఆరే.

ప్రత్యేక అధికారిగా ఐఏఎస్

ప్రస్తుత పరిస్థితుల్లో ముఖ్యమంత్రులు తమ నియోజకవర్గాల్లో మరో వ్యక్తికి అవకాశం లేకుండా వారే చూసుకుంటారు. ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. తాను ఎక్కడున్నా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఆగకూడదన్న ఉద్దేశంతో ఐఏఎస్ అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సైతం రెండుమూడు రోజులపాటు ఇక్కడే మకాంవేసి, అభివృద్ధి పనులను పరుగులు పెట్టించేవారు.

తగ్గని అభిమానం

ఎన్టీఆర్ మూడుసార్లు ఇక్కడి నుంచి గెలుపొందారు. ఆయన మరణానంతరం కూడా ఆ కుటుంబంపై నియోజకవర్గ ప్రజలకు అభిమానం తగ్గలేదు. ఆయన తరువాత తనయుడు హరికృష్ణ ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు. ప్రస్తుతం నందమూరి బాలకృష్ణకు సైతం రెండుసార్లు నియోజకవర్గ ప్రజలు పట్టంకట్టారు. వీరితోపాటు పార్టీని స్థాపించిన అనంతరం రంగనాయకులు, సీసీ వెంకటరాముడు, అబ్దుల్‌ఘని కేవలం ఎన్టీఆర్ బొమ్మతో గెలిచారని చెప్పవచ్చు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు హిందూపురంలో టీడీపీ తప్ప మరో పార్టీకి అవకాశం లేకుండా పట్టం కడుతూ వస్తున్నారంటే ఎన్టీఆర్‌పై ఈ ప్రాంత ప్రజలకున్న అభిమానం ఏపాటిదో తెలుస్తోంది.

నేడు అన్నదానం

ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం హిందూపురంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. అన్నదానం చేయనున్నారు. ఎన్టీఆర్ విగ్రహాల వద్ద నివాళులు అర్పించనున్నట్లు నాయకులు తెలిపారు. పలు సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

పురం అభివృద్ధికి ఎన్టీఆర్ ఎనలేని కృషి



పురంలోని ఎన్టీఆర్ విగ్రహం

ఎక్కడాలేని విధంగా విగ్రహాలు


ప్రధాన పట్టణాల్లో సైతం మహనీయుల ఒకటి రెండు విగ్రహాలుంటాయి. హిందూపురం పట్టణంలో నాలుగుచోట్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. మొదట పాతబస్టాండు, తరువాత గురునాథ్ సర్కిల్, సూగూరు ఆంజనేయస్వామి క్రాస్‌వద్ద, సూరప్పకట్ట మీద ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. దీంతోపాటు లేపాక్షి, చిలమత్తూరు, తూమకుంట చెక్‌పోస్టు, మిట్టమీదపల్లిలో కూడా ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఎన్టీఆర్ విగ్రహాలున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని నిర్మింపజేసిన మాత శిశు సంరక్షణ కేంద్రానికి సైతం బసవతారకం పేరు పెట్టడం విశేషం.

వర్సిటీలకు కొత్త వీసీలు

జేఎన్‌టీయూకి శ్రీనివాసరావు, ఎస్కేయూకి హుస్సేన్‌రెడ్డి నియామకం



జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు



ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్, జనవరి 17: జిల్లాలో జేఎన్‌టీయూ, ఎస్కే యూనివర్సిటీలకు కొత్త వీసీలను నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్యామల రావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. జేఎన్‌టీయూ వీసీగా ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు, ఎస్కేయూ వీసీగా ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి నియమితులయ్యారు. జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు ప్రస్తుతం విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి ఎస్కేయూలోని రసాయనశాస్త్ర విభాగం ప్రొఫెసర్‌గా రిటైర్డ్ అయ్యారు. జేఎన్‌టీయూ వీసీగా రంగజనార్దన పదవీకాలం బుధవారంతో ముగిసింది. ఎస్కేయూ ఇన్‌చార్జ్‌వీసీగా రామకృష్ణారెడ్డి పదవీ కాలం నవంబరులో ముగియడంతో యోగివేమన వీసీ ప్రొఫెసర్ సుధాకర్ ఇన్‌చార్జ్ వీసీగా పనిచేస్తున్నారు.

ఎస్కేయూ వీసీ బాధ్యతల స్వీకరణ...

ఎస్కేయూ వీసీగా ప్రొఫెసర్ హుస్సేన్‌రెడ్డి బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ఆధ్వర్యంలో వీసీగా సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థి సంఘాల నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి

25లోపు పశుసంవర్ధక సహాయకులకు పోస్టింగ్

అనంతపురం అర్బన్, జనవరి 17: ఉమ్మడి అనంత జిల్లాలో ఖాళీగా ఉన్న పశుసంవర్ధక సహాయకుల పోస్టులకు సంబంధించి అర్హులైన అభ్యర్థులకు ఈనెల 25వ తేదీలోగా పోస్టింగ్‌లు ఇస్తామని ఆ శాఖ జేడీ సుబ్రహ్మణ్యం బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని 473 పశుసంవర్ధక సహాయకుల పోస్టులకు గతేడాది డిసెంబరులో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించగా 919 మంది హాజరయ్యా రన్నారు. రోస్టర్, మెరిట్ ఆధారంగా అర్హుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, జనవరి 17: ఐసీడీఎస్‌లో పలు విభాగాల పరిధిలో ఖాళీగా ఉన్న రెండు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీడీ శ్రీదేవి బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ సమితిలో సోషల్‌వర్కర్-1, శిశుగృహంలోని డాక్టర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీకి కలెక్టర్ ఆదేశాలిచ్చారన్నారు. ఉద్యోగార్హతలు, జీతం, దరఖాస్తు విధానం వివరాలు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో శుక్రవారం నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. ఈనెల 27 సాయంత్రం ఐదు గంటల వరకూ ఐసీడీఎస్‌లో పీడీ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

చేనేతల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి



మాట్లాడుతున్న సత్యనారాయణ మూర్తి

అనంతపురం విద్య, జనవరి 17: దేశంలో చేనేత రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసి, చేనేతలపై నిర్లక్ష్యం చూపుతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి మండిపడ్డారు. బుధవారం స్థానిక లలిత కళా పరిషత్‌లో నిర్వహించిన చేనేత రంగం నిర్మాణ మహాసభలో ఆయన మాట్లాడారు. మిషన్ వస్త్రాలు వచ్చాక చేనేత వస్త్రాలను చిన్నచూపు చూస్తున్నారన్నారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో చేనేతలకు వాగ్దానాలు ఇవ్వడం మినహా... వారిని ఆదుకున్న దాఖలాలు లేవని మండిపడ్డారు. ప్రధాని మోడీకి చిత్తశుద్ధి ఉంటే... కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ వారానికి ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించి విధులకు వచ్చేలా జీవో విడుదల చేయాలని, దీంతో చేనేత రంగం మరింత బాగుపడుతుందని అన్నారు. సీఎం జగన్ నేతన్న నేస్తం, అమ్మఒడి, చేయూత అంటూ చాలా పథకాలు పెట్టారే కానీ... ఏ ఒక్క రంగాన్నీ ఆదుకున్న పరిస్థితి లేదన్నారు. చేనేతలను ప్రభుత్వాలు ఆదుకోవాలని, వారి సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఈ నెల 20,21 తేదీల్లో గుంటూరులోని మంగళగిరిలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, చేనేత కార్మిక రంగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, జిల్లా కన్వీనర్ శ్రీరాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజారెడ్డి, ఇతర నేతలు రాజారెడ్డి, లక్ష్మయ్య, రాజేష్ గౌడ్, రమణయ్య, అల్లిపీరా పాల్గొన్నారు.

కసాపురం దేవస్థాన ఈఓగా సాగర్‌బాబు



విధుల్లో చేరుతున్న సాగర్‌బాబు

గుంతకల్లు, జనవరి17: కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఈఓగా సాగర్‌బాబు బుధవారం ఉదయం విధుల్లో చేరారు. శ్రీకాళహస్తి ఈఓగా పనిచేసిన ఈయన కసాపురం ఆలయ ఈవోగా నియమితులయ్యారు. కసాపురం ఆలయంలో చోరీ జరిగిన నేపథ్యంలో ఇక్కడ పనిచేసిన ఈఓ వెంకటేశ్వరరెడ్డిని బదిలీచేసి కర్నూలు ఏసీ గురుప్రసాద్‌ను కసాపురం తాత్కాలిక ఈఓగా నియమించారు. ఈ నేపథ్యంలో సాగర్‌బాబును ఇక్కడకు ఈఓగా పంపగా, ఆయన విధులను స్వీకరించారు.

స్వాధీనం చేసుకున్న మద్యం ధ్వంసం

అనంతపురం క్రైం, జనవరి 17: పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని సెబ్ అడిషినల్ ఎస్పీ రామక్రిష్ణ ఆధ్వర్యంలో బుధవారం టీవీ టవర్ సమీపంలో సెబ్ పోలీసులు ధ్వంసం చేశారు. అనంతపురం సెబ్ స్టేషన్‌లో నమోదైన 11 కేసుల్లోని రూ.3,22,419 విలువైన 7,946 మద్యం బాటిళ్లు, బుక్కరాయసముద్రం సెబ్‌స్టేషన్‌లో తొమ్మిది కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.18,919 విలువైన 278 బాటిళ్లు, అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసులో స్వాధీనం చేసుకున్న రూ. 84,840 విలువైన 2,122 మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో అనంతపురం సెబ్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర, బుక్కరాయసముద్రం సెబ్ ఇన్‌స్పెక్టర్ హసీనాబాను, రూరల్ ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్సీ భూమిరెడ్డి



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తి, జనవరి 17: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బుధవారం పుట్టపర్తికి వచ్చిన సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌ను హైటెక్ సిటీగా తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబుదే అన్నారు. విభజనం అనంతరం ఏపీ గడ్డు పరిస్థితుల్లో ఉందని, అప్పుడు రాష్ట్రాన్ని గాడిలో పెట్టారని, అమరావతిని రాజధానిగా చేసి అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. వైసీపీ పాలలో అభివృద్ధి ఏమాత్రం జరగలేదన్నారు. అదీగాక రాష్ట్రం అప్పులపాలైందని విమర్శించారు. రాష్ట్రం మళ్లీ గాడిలో పడాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. వైసీపీపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సామకోటి ఆదినారాయణ, కొత్తపల్లి జయప్రకాష్, పవన్‌కుమార్, భాస్కర్, పుట్ల గంగాద్రి, సుధీర్,అనిల్, ఫణి , పీట్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

షర్మిల చేరికతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం

● పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగన అశ్వత్థనారాయణ

ధర్మవరం, జనవరి 17: వైఎస్ షర్మిల చేరికతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రాబోతుందని ఆ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి రంగన అశ్వత్థనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిలను పీసీసీ అధ్యక్షురాలిగా నియమించడం శుభపరిణామమన్నారు. అదేవిధంగా గిడుగు రుద్రరాజును సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించడం కూడా శుభపరిణామమన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రాబోతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు షమీవుల్లా, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు కరీం, డీసీసీ డైరెక్టర్ సయ్యద్ తాహీర్, జనరల్ సెక్రెటరీ మునాఫ్ పాల్గొన్నారు.

షర్మిల నియామకంపై హర్షం

కదిరిఅర్బన్: పీసీసీ అధ్యక్షురాలుగా వైఎస్ షర్మిల నియామకంపై ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. షానవాజ్ హర్షం వ్యక్తంచేశారు. పట్టణంలో బుధవారం ఆయన పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరాగాంధీ, వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం షర్మిలకు శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో నాయకులు అస్రఫ్ అమీర్‌సాబ్, పవన్‌కుమార్, అల్లాబక్షు, ఖాదర్‌బాషా, బాబాఫక్రుద్దీన్, నాగేంద్ర పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం.. అందరికీ ఆదర్శం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ప్రజారవాణా ఉద్యోగులు

పుట్టపర్తి, జనవరి 17: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శమని ప్రజారవాణ సంస్థ కడప జోన్ చైర్ పర్సన్ మాల్యవంతం మంజుల పేర్కొన్నారు. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ ఆహ్వాన పత్రాలను పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన విజయవాడలోని స్మృతివనంలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం, సామాజికాభివృద్ధి, ఆర్థిక ఫలాలు అందేలా రాజ్యాంగాన్ని రాసిన వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. ఆయన విగ్రహావిష్కరణకు అందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, ఎస్‌టీఐ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



శ్రీకృష్ణదేవరాయల చిత్రపటం వద్ద కేక్ కట్ చేస్తున్న కాపు సంక్షేమ సేన నాయకులు

ముదిగుబ్బ, జనవరి17: మండలకేంద్రంలో కాపుసంక్షేమసేన నాయకులు శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండు కూడలిలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..... శ్రీకృష్ణదేవరాయలు తన పరిపాలనలో ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తొలుత బైక్ ర్యాలీ నిర్వహించారు. కాపుసంక్షేమసేన మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, సభ్యులు నారాయణ స్వామి, నరేష్, డేగలవెంకట్, చంద్రశేఖర్, గోవిందు,కిశోర్, రాజశేఖర్, గుర్రం జయచంద్ర, గుర్రం కరుణాకర్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి



పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లు

ఓబుళదేవరచెరువు, జనవరి 17: కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆల్‌ఆంధ్ర డ్రైవర్లు, క్లీనర్ల అసోసియేషన్ సభ్యులు బుధవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం సమర్పించారు. తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వారు వినతిపత్రం అందించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ హిట్‌అండ్ రన్ చట్టం ద్వారా 14 ఏళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా ఉంటున్నాయని, వీటి వల్ల డ్రైవర్ల జీవితాలు పూర్తిగా అంధకారంలోకి వెళతాయని, కావున ఈచట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



సోమగుట్టపల్లిలో అయోధ్యరాముని అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నల్లమాడ, జనవరి 17: మండలంలోని సోముగుట్టపల్లిలో బుధవారం అయోధ్యరాముడి అక్షింతలను ఇంటింటికీ పంచారు. ఈసందర్భంగా టీడీపీ నాయకుడు బుట్టి నాగభూషణనాయుడు, ఎల్‌ఐసీ రమణ మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. ఆ రోజున ప్రతిఇంటి ముంగిట దీపాలు వెలిగించి.. అక్షింతలను తలపై జల్లుకుని రాముడిని స్మరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ సూర్యనారాయణరెడ్డి, గంగిరెడ్డి, శేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చిన్నాదేవి భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు కొత్తపల్లి కబడ్డీ జట్టు

అమడగూరు, జనవరి 17: ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి కబడ్డీ మండలంలోని ఎ.కొత్తపల్లి జట్టు ప్రతిభ కనబరచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన క్రికెట్ పోటీల్లో ఎ. కొత్తపల్లి జట్టు జేకేపల్లి జట్టుపై గెలుపొంది నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైనట్లు క్రీడాకారులు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో..

సీఎం విఫలం

● సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

● 37వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

ధర్మవరం, జనవరి 17: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో సీఎం జగన్ విఫలం చెందారని సీపీఐ జిల్లాకార్యదర్శి వేమయ్యయాదవ్ మండిపడ్డారు. న్యాయమైన సమస్యలకు పరిష్కారం కోరుతూ పట్టణంలోని అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 37వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు సీపీఐ జిల్లాకార్యదర్శివేమయ్యయాదవ్, ఏపీచేనేత కార్మికసంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ, ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎల్‌ఆదినారాయణల సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా వేమయ్యయాదవ్ మాట్లాడుతూ... గత 37 రోజులుగా అంగన్‌వాడీలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అదీగాక ఎస్మా ప్రయోగంతో అంగన్‌వాడీలను బెదిరించాలని చూడడం హేయమన్నారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలనే అంగన్‌వాడీలు అడిగారని, వీటిని కూడా సీఎం అమలు చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. దీన్ని బట్టి చూస్తుంటే సమస్యల పరిష్కారంలో సీఎం విఫలమైనట్టేనని పేర్కొన్నారు.

కదిరిఅర్బన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. ఇందుకు డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర, ఐద్వా మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు సాయిలక్ష్మి మద్దతు తెలిపి మాట్లాడారు. దాదాపు 37 రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాబున్నీసా, చంద్రకళ, సువర్ణ, లక్ష్మీదేవి, సుజాత, రామలక్ష్మమ్మ, సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. ఇందులో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేవరకు పోరాటాలు ఆపేది లేదని ప్రాజెక్టు యూనిట్ అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు రంగమ్మ, మణిమాల, క్రిష్ణమ్మ, కమలమ్మ, వరలక్ష్మీ, అరుణమ్మ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో అంగన్‌వాడీలకు సంఘీబావం తెలుపుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తదితరులు



కదిరిలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు



ఓడీసీలో అంగన్‌వాడీ సమ్మెలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ

రామకృష్ణను విమర్శించే స్థాయి తోపుదుర్తికి లేదు

● సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

ధర్మవరం, జనవరి 17: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను విమర్శించే స్థాయి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తిప్రకాష్ రెడ్డికి లేదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, రైతుసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని శ్రీవత్సలాడ్జ్‌లో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామకృష్ణ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి జిల్లాలో ఎక్కడున్నారో గుర్తుకు చేసుకోవాలన్నారు. రామకృష్ణ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తోపుదుర్తికి బీటీ రోడ్డు వేశారని, ఎందరో పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చారని, అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద ఉన్న 49 చెరువులకు నీటిని తెచ్చారని తెలిపారు. మరి రాప్తాడు ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు మీరు ఏమి చేశారని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులను విమర్శిస్తే టికెట్లు, పదవులు వస్తాయనుకోవడం మూర్ఖత్వమన్నారు. లక్ష ఎకరాలకు నీరు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. పశ్చిమబెంగాల్ కార్మికులను జగనన్న కాలనీలో నిర్బంధించడంపై ఆ రాష్ట్ర పార్లమెంట్ సభ్యుడు అనంతపురం జిల్లా కలెక్టర్, ఎస్పీలకు లేఖ రాయడం అప్పుడే మరచిపోయావా అని దుయ్యబట్టారు. ప్రకాష్ రెడ్డి అక్రమాలు, దౌర్జన్యాలను బహిర్గతం చేసే పత్రికలపై, రామకృష్ణపై విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ రైతుసంఘంజిల్లా సహాయకార్యదర్శి జేవీరమణ, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్, కార్యవర్గసభ్యులు మహదేవ్, చేనేత కార్మికసంఘంతాలూకా అధ్యక్షకార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు పూడ్చుతారా.. లేదా?

● ఆర్‌అండ్‌బీ డీఈని ప్రశ్నించిన గోనుగుంట్ల అనుచరులు

● అనుమతిస్తే తమ నాయకుడు పూడ్చుతారంటూ వినతి



ఆర్‌అండ్‌బీ డీఈకి వినతిపత్రం అందజేస్తున్న గోనుగుంట్ల అనుచరులు

ధర్మవరం, జనవరి 17: పట్టణంలో రోడ్లపై ఏర్పడిన గుంతలను మీరు పూడ్చుతారా.. లేదా.. అని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల అనుచరులు ఆర్‌అండ్‌బీ అధికారులను ప్రశ్నించారు. మీరు పూడ్చలేకపోతే.. అనుమతి ఇవ్వాలని, తమ నాయకుడు గోనుగుంట్ల సూర్యనారాయణ పూడ్చుతారని తెలిపారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల తన లెటర్‌ప్యాడ్ ద్వారా రాసిన వినతిపత్రాన్ని ఆయన అనుచరులు ఆర్‌అండ్‌బీ డీఈ నాగపుల్లమ రావుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పట్టణంలో గుంతల మయమైన రోడ్లతో ప్రజలు నరకయాతన పడుతున్నారన్నారు. ద్విచక్రవాహన దారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఎందరో రోడ్డు ప్రమాద బాధితులు గోనుగుంట్లకు సమస్య విన్నవించారన్నారు. ఇందుకు స్పందించిన ఆయన ఈ మేరకు వినతిపత్రాన్ని పంపించారని తెలిపారు. 'గుంతలను మీరైనా పూడ్చండి లేదా.. మా నాయకుడు గోనుగుంట్ల సూర్యనారాయణ సొంత నిధులతో పూడ్చుతా రం'టూ తెలియజేశారు. దీంతో డీఈ ఉన్నతాధికారులదృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అనుచరులు డిష్ రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, గొట్లూరు చంద్ర, చిలకం సూర్యనారాయణ రెడ్డి, నబీరసూల్, సరితాల దస్తగిరి, మార్కెట్‌రహీం, పల్లాగోపాలక్రిష్ణ, నారాయణస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ

తనకల్లు, జనవరి 17: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలో, వాటికోసం ఏయే ప్రణాళికలు తయారు చేయాలో సంబంధితాధికారులు, ప్రజాప్రతినిధులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూలనరసింహులు, ఈఓఆర్‌డీ ఆనందయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు హాజరుకండి

పుట్టపర్తిరూరల్, జనవరి 17: గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రెండురోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులకు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీఓ నాగేశ్వర రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని మండలపరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హాజరు కావాలన్నారు. శిక్షణ తరగతులు గురు, శుక్రవారాలు రెండురోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు.

ముస్లింలపై దాడి అమానుషం

కొత్తచెరువు, జనవరి 17: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లింలపై దాడులు రాష్ట్రంలో ఏదో ఒక చోటు జరుగుతూనే ఉన్నాయని మండలకేంద్రంలోని ముస్లిం నాయకులు మండిపడ్డారు. రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలోని వినకొండలో వైసీపీ నాయకులు టీడీపీ మైనార్టీ నాయకులపై దాడి చేయడాన్ని వారు ఖండించారు. మండలకేంద్రంలోని హిదయతుల్లా ఐరన్‌దుకాణంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకులు మైనార్టీలపై దాడులు చేస్తుంటే ముఖ్యమంత్రి చోద్యం చూస్తున్నారే తప్పా ఖండించిన పాపాన పోలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మైనార్టీ సంక్షేమపథకాలను సైతం రద్దు చేసిందన్నారు. మైనార్టీలకు మంచి జరగాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాబా, షబ్బీర్, నబీ, అబీద్, బాబావలి, అల్లాబకాష్ పాల్గొన్నారు.

వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలి

పుట్టపర్తి, జనవరి 17: యోగివేమన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఏపీ రెడ్డి సంఘం అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గత ఏడాది వేమన జయంతిని నిర్వహించడానికి ప్రభుత్వం జీవో తెచ్చిందన్నారు. కనుక ఈనెల 19న వేమన జయంతిని కటారుపల్లిలో రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. ఇందుకు కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.

సరిగా అందని బీఎస్ఎన్ఎల్ సేవలు

● తనకల్లులో కరెంటు కట్ అయితే పని చేయని సెల్ టవర్

● సిగ్నల్స్ అందక మూగబోతున్న ఫోన్లు ● అసౌకర్యానికి గురవుతున్న వినియోగదారులు

తనకల్లు, జనవరి 17: మండలకేంద్రంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటు చేశారు. ఆ టవర్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఉండేది. కాలక్రమేణ ఆ కార్యాలయం మూసివేశారు. నాటినుంచి బీఎస్ఎన్ఎల్ సేవలు కదిరి నుంచి కొనసాగుతున్నాయి. అయితే ఇటీవల గత మూడు నెలలుగా మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో సిగ్నల్స్ అందక సెల్‌ఫోన్లు మూగబోతున్నాయి. ఇదేమని ఆరా తీసిన వినియోగదారులకు బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్వాహణకోసం ఏర్పాటు చేసిన బ్యాటరీలు పాడైపోవడంతో పనిచేయడం లేదని, కేవలం కరెంటు ఉన్న సమయంలో మాత్రమే టవర్ పనిచేస్తుందని తెలిసింది. కరెంట్ కట్ అయితే బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ నిలిచిపోతున్నాయి. దీంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయంపై అధికారులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేకపోతోంది. చేసేదిలేక చాలామంది వినియోగారులు జియో, ఎయిర్‌టెల్‌కు మారిపోతున్నారు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి టవర్ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యువకుడి ఆత్మహత్య

తనకల్లు, జనవరి 17: మండలంలోని ఎగువతొట్లిపల్లి గ్రామానికి చెందిన భానుప్రకాష్(25) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. భానుప్రకాష్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. పని ఒత్తిడి భరించలేక ఇటీవల ఉద్యోగం వదిలి ఇంటికి వచ్చాడు. కాగా ఈనెల 3వ తేదీన మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే బెంగుళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం తండ్రి క్రిష్ణమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ధర్మవరం క్రీడాకారిణి



నవ్యతో కోచ్‌లు

ధర్మవరం, జనవరి 17: రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ధర్మవరం పట్టణానికి చెందిన క్రీడాకారిణి నవ్య ఎంపికైనట్టు కోచ్ పృథ్వీ తెలిపారు. ఈనెల 15 వతేదీన గుంతకల్లులో జరిగిన ఉమ్మడిజిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో నవ్య ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఈ పోటీలు నంద్యాలలో ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో నవ్య పాల్గొననున్నట్లు చెప్పారు. స్థానిక క్రీడామైదానంలో బుధవారం నవ్యను కోచ్‌తో పాటు ఆర్టీటీ ఆర్డీ ప్రమీల, ఏటీఎల్ శ్రీనివాసులు తదితరులు అభినందించారు.

జైశ్రీరామ్ స్టిక్కర్ల పంపిణీ

ధర్మవరం, జనవరి 17: జైరామ్ స్టిక్కర్లను ధర్మవరం యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీచేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగనుందని, ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి జైరామ్ స్టిక్కర్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ద్విచక్రవాహనాలకు ఆ స్టిక్కర్లను అంటించి అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు రామన్న, తిరుమలేశ్, రోటరీ క్లబ్ సభ్యులు నరేంద్రరెడ్డి, మనోహర్‌గుప్తా, యోగాఅసోషియేషన్ ఆర్గనైజర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న యోగా అసోసియేషన్ సభ్యులు

జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి పనులు కల్పించాలి

ఓబుళదేవరచెరువు, జనవరి 17: రానున్న వేసవిలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ సిద్ధారెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వారు ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2024-25వ ఏడాదికి సంబంధించి పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పెడింగ్‌లో ఉన్న బిల్లులు త్వరలో వస్తాయని కూలీలకు తెలపాలన్నారు. సమావేశంలో ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి, సాంకేతిక సహాయకులు రాజారెడ్డి, చంద్రారెడ్డి, హనుమంతురెడ్డి, ఈసీ ఆంజనేయులు, క్షేత సహాయకులు పాల్గొన్నారు.

నేడు కొండకమర్లలో జయహో బీసీ

ఓబుళదేవరచెరువు, జనవరి 17: మండలంలోని కొండకమర్లలో గురువారం మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం జరగనున్నట్లు ఆ పార్టీ కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్ తెలిపారు. మండలకేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమానికి ముందు స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి బైక్‌ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కొండకమర్లలో ప్రారంభమయ్యే ర్యాలీ కుసుమవారిపల్లి, గాజుకుంటపల్లి, ఇనగలూరు ,తుమ్మలకుంటపల్లి, వెంకటాపురం, ఓడీచెరువు, తంగేడుకుంట, గౌనిపల్లి మీదుగా సాగి తిరిగి కొండకమర్లకు చేరుకుంటుందన్నారు. అనంతరం అక్కడ జయహోబీసీ బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. కార్యకర్తలు, నాయకులు, బీసీలు పెద్దఎత్తును తరలిరావాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

అమడగూరు, జనవరి 17: మండలంలోని జొౌకల గ్రామానికి చెందిన రామాంజనేయులపై బుధవారం ఎస్ఐ బలరామయ్య ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రామాంజనేయులు అదే గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తిపై పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని ఈనెల 12న దాడిచేసి, కులం పేరుతో దూషించాడు. దీంతో నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా గౌస్‌లాజం



గౌస్‌లాజం

ఓబుళదేవరచెరువు, జనవరి 17: డెమెక్రటిక్ టీచర్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన గౌస్ లాజం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో రెండో సారి ఇతన్ని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక చేశారు. అలాగే మండలాధ్యక్షుడిగా ఎల్‌సీ నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా సోముశేఖర్‌నాయక్‌తో పాటు మరికొందరిని ఎన్నుకున్నారు. గౌస్‌లాజం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు కృషిచేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

అమడగూరు, జనవరి 17: కర్ణాటక మద్యంను ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్ఐ బలరామయ్య తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక సరిహద్దులోని చినగానిపల్లి సరిహద్దు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. చింతామణి నుంచి కదిరికి వస్తున్న ప్రయివేటు బస్సులో అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తనిఖీ చేయగా జొౌకల గ్రామానికి చెందిన జయన్న నుంచి 56 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

నేడు ధర్మవరంలో నీటి సరఫరా బంద్

ధర్మవరం, జనవరి 17: ధర్మవరం మున్సిపాలిటీకి సంబంధించి తంబాపురం వాటర్ వర్క్స్‌లో పైప్‌లైన్ లీకేజ్ వల్ల నీరు వృథాగా వెళ్తోందని, వీటి మరమ్మతుల కారణంగా ధర్మవరం పట్టణంలో గురువారం నీటి సరఫరాను బంద్ చేయనున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 7 నుంచి రాత్రి 7గంటల వరకు నీటి సరఫరా బంద్ చేయనున్నట్లు చెప్పారు. కావున పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

గుడిబండ తహసీల్దార్‌గా ప్రతాప్‌రెడ్డి

గుడిబండ, జనవరి 17 : మండల తహసీల్దార్‌గా ప్రతాప్‌రెడ్డిని ఉన్నతాధికారులు నియమించారు. కడప జిల్లాలో పనిచేస్తున్న ప్రతాప్‌రెడ్డిని గుడిబండ తహసీల్దార్‌గా నియమించినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ యేడాది జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్‌ల అంతర్‌జిల్లాల బదిలీల్లో భాగంగా గుడిబండ తహసీల్దార్‌గా ప్రతాప్‌రెడ్డిని నియమించినట్లు సమాచారం. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ మురళీక్రిష్ణకు బదిలీ ఉత్తర్వులు రాలేదని స్థానిక అధికారులు తెలిపారు.

కాంగ్రెస్ యువజన విభాగం

జిల్లా అధ్యక్షుడిగా వంశీకృష్ణ

హిందూపురం, జనవరి 17 : కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా వంశీకృష్ణను ఎంపిక చేసినట్లు ఆయన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కష్టకాలంలో పార్టీ వెంటున్న తనను అధిష్టానం గుర్తించి జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధికి మరింత కృషిచేస్తానన్నారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని పదవి అప్పగించిన అధిష్టానం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

గోరంట్ల, జనవరి 17: పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు బుధవా రం శిక్షణ కార్యక్రమం పారంభించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు రెండురోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. పంచాయతీలకు మంజూరయ్యే వివిధరకాల నిధులతో చేపట్టబోయే పనులతో ప్రణాళికలు ఎలా రూపొందించాలో వివరించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ పాలే జయరాం నాయక్, ఎంపీడీఓ రఘునాథ్ గుప్త, ఈఓఆర్‌డీ సుధాకర్, ఈపీఓ వరప్రసాద్, ఈపీఎం నారాయణ పాల్గొన్నారు.

కానుకల అందజేత

హిందూపురం, జనవరి 17: పట్టణంలోని 9వ వార్డు సచివాలయంలో పనిచేసే సిబ్బందితోపాటు వలంటీర్లకు టీడీపీ కౌన్సిలర్ మంజునాథ్, నవీన్ సంక్రాంతి కానుకలు అందజేశారు. పండుగకు సెలవుల అనంతరం బుధవారం సచివాలయానికి వచ్చిన సిబ్బందికి సంక్రాంతి కానుకలను అందజేసినట్లు కౌన్సిలర్ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ విశ్వనాథ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో సెల్‌టవర్ వద్దు

మడకశిర రూరల్, జనవరి 17: మండలంలోని గౌడనహళ్లిలో ఇళ్ల మధ్యలో సెల్ టవర్ నిర్మాణం ఆపాలని కలెక్టర్ ఆదేశాలు ఉన్నట్లు స్థానికురాలు లక్ష్మీదేవమ్మ తదితరులు పేర్కొన్నారు ఆమె మంగళవారం మాట్లాడుతూ.. ఇళ్ల మధ్యలో సెల్‌టవర్ నిర్మించడం వల్ల పరిసరాల్లో నివాసం ఉన్న వారు అనేక ఇబ్బందులు ఎర్కొనవలసి వస్తుందన్నారు. కావున దాని నిర్మాణం పనులను వెంటనే ఆపాలంటూ డిసెంబరులో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అందుకు స్పందించిన కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారించి తగు నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో టవర్ నిర్మాణ పనులు చేస్తున్నారని ఆమె అన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి ఇళ్ల మధ్యలో సెల్ టవర్ నిర్మాణలను నిలిపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

వృద్ధాశ్రమానికి సాయం

మడకశిర రూరల్, జనవరి 17: మండలంలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమానికి ఉరవకొండకు చెందిన జగదీశ్ బుధవారం రూ.20 వేలు విలు చేసే బియ్యం, కందిపప్పు, చక్కెర తదితర సరుకులను అందజేశారు. రూ.5 వేలు నగదు అందజేశారు.

గొడవపై పోలీసులకు ఫిర్యాదు

రొద్దం, జనవరి 17: సంక్రాంతి పండగ రోజు మండలకేంద్రంలో జరిగిన గొడవపై మూర్తి, అనిల్‌కుమార్ వర్గీయులు ఏడుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు వ్యక్తులు సోమవారం అతిగా మద్యం తాగి గొడవ పడగా... చిలికి చిలికి గాలివానగా మారి రెండు వర్గాల మధ్య పరస్పర దాడులకు దారితీసింది. గొడవలో అనిల్, మూర్తికి రక్తగాయాలయ్యాయి. ఇరువురు ఆసుపత్రి పాలయ్యారు. మూర్తి బుధవారం రొద్దం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్‌ఐ వలీబాషను వివరణ కోరగా... ఫిర్యాదు అందిందని ఇరు వర్గీయులను విచారించి కేసు నమోదు చేస్తామన్నారు. రొద్దంలో జరిగిన ఘటనపై జిల్లా ఎస్పీ, పెనుకొండ డీఎస్పీ ఆరాతీసినట్లు సమాచారం.

బైక్‌లు ఢీ: ముగ్గురికి గాయాలు

గోరంట్ల, జనవరి 17: స్థానిక కదిరి రహదారిలో పెట్రోల్‌బంక్ వద్ద బుధవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. కమ్మవారిపల్లికి చెందిన నారాయణప్ప, శ్యామల వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని కల్యాణ్‌కుమార్ అనే వ్యక్తి బైక్‌పై ఎదురుగా వస్తూ ఢీకొట్టాడు. నారాయణప్పకు నడుము దెబ్బతినగా, శ్యామలకు కుడికాలు విరిగింది. వారిని 108లో హిందూపురం తరలించారు. కల్యాణ్‌కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. ముగ్గురికి గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్సలు చేశారు.

చిరుత దాడిలో దూడ మృతి

పావగడ, జనవరి 17: తాలూకా పరిధిలోని మంగళవాడ గ్రామంలో బుధవారం రాత్రి చిరుత దాడి చేయడంతో ఆవు దూడ మృతి చెందిందని రైతు దొడ్డణ్ణ.. అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల క్రితం ఇదే ప్రాంతంలో రెండు మేకలు, రెండు గొర్రెలను కూడా చిరుత తినేసి వాటి కళేబరాలను వదిలివేసిందని, రాత్రిపూట పొలాల్లోకి వెళ్లడానికి కూడా భయాందోళన కలిగిస్తోందని రైతులు వాపోయారు. ఇటీవల జనవ్రంతిలోకి వన్యప్రాణులు యథేచ్ఛగా తరలివస్తున్నాయని, ప రోజుల క్రితం పెద్దపులి కూడా సంచరించినట్లు రైతులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనాస్థలానికి ఫారెస్టు రేంజర్ బసవరాజు, అస్లాంబాషా, పశు వైద్యాధికారి అశ్వత్థనారాయణ శెట్టి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొన్నారు.

ఇంట్లో చోరీ

హిందూపురం, జనవరి 17: స్థానిక దండు రోడ్డు వద్ద జై హనుమాన్ నగర్ సమీపాన నయాంఖాన్ ఇంట్లో సోమవారం రాత్రి దొంగలుపడ్డారు. నయాంఖాన్ కుటుంబ సభ్యులు.. బంధువుల ఇంటికి వెళ్లారు. వారు మంగళవారం మధ్యాహ్నం వచ్చి చూసేసరికి ఇంటికి వెనుక వైపు తలుపులు పగలకొట్టి, లోపల బీరువాలోని సుమారు 8 తులాల బంగారం, కొంత నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. నయాంఖాన్.. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జయరామప్ప తెలిపారు. పోలీసులు సోమవారం ప్రధాని బందోబస్తు డ్యూటీలో ఉండగా ఇదే అదునుగా భావించి చోరీకి పాల్పడినట్లు తెలిసింది.

ప్రభుత్వ నోటీసులకు అంగన్‌వాడీల జవాబు



పురంలో సీడీపీఓ రెడ్డిరమణమ్మకు బదులు నోటీసు అందిస్తున్న అంగన్‌వాడీలు



పెనుకొండలో సీడీపీఓ శాంతలక్ష్మికి బదులు నోటీసు అందజేస్తున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపేదే లేదు

తేల్చి చెప్పిన కార్యకర్తలు, ఆయాలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెను తిరస్కరిస్తూ ప్రభుత్వం... వెంటనే విధుల్లోకి చేరాలని షోకాజ్ నోటీసులు అందించారు. దీంతో హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీలు బుధవారం సీడీపీఓను కలిశారు. ప్రభుత్వం అందించిన నోటీసుకు బదులునోటీసు ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి తాము చేస్తున్న న్యాయమైన డిమాండ్‌లు సాధించే వరకు సమ్మె ఆపేదే లేదని తేల్చి చెప్పారు. మొదట బుడెన్‌సాబ్ బంగళా వద్ద సమావేశం ఏర్పాటు చేసుకుని అక్కడ నుంచి ర్యాలీగా వెళ్లి సీడీపీఓ రెడ్డిరమణమ్మకు బదులు నోటీసు అందజేశారు. అదేవిధంగా పెనుకొండలో సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు పట్టణంలో నుంచి సీడీపీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్మా నోటీసులకు బదులుగా నోటీసులను సీడీపీఓ శాంతలక్ష్మికి అందజేయడానికి వెళ్లారు. అయితే సీడీపీఓ వాటిని తీసుకోవడానికి నిరాకరించడంతో పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆమె వచ్చి వాటిని తీసుకున్నారు. అదేవిధంగా సోమందేపల్లి, మడకశిర, గుడిబండ, అగళి రొద్దం తదితర చోట్ల అంగన్‌వాడీల నిరసన కొనసాగింది.

ఎమ్మెల్యే కారు డ్రైవర్‌పై స్టేషన్‌లో ఫిర్యాదు

వైసీపీ నాయకుడు రవిశేఖర్‌రెడ్డి వెల్లడి

మడకశిరటౌన్, జనవరి 17: స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి కారు డ్రైవర్ ధనుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అసమ్మతి నాయకుడు వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. రవిశేఖర్‌రెడ్డిపై ఎమ్మెల్యే కొడవలితో దాడిచేసి హత్యాయత్నం చేసే విధంగా ఎమ్మెల్యే కారు డ్రైవర్ ధను అతడి ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేశాడని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పార్టీ అభివృ ద్ధి కోసం ఎంతో కష్టపడి పనిచేశామని, అయినా ఎమ్మెల్యే కారుడ్రైవర్ ఇలాంటి పోస్టులు పెట్టడం తగదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి ప్రోద్బలంతో ఈ పోస్టులు పెట్టారో అర్థమవుతోందన్నారు. బ్రోకర్లను, చెంచాలను పెట్టుకొని తనపై ఇలాంటి భయాందోళన కలిగించే ప్రయత్నాలు మానుకోకపోతే నష్టపోయేది ఎమ్మెల్యేనే అని పరోక్షంగా తెలిపారు. ఈవిషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. వారి అవినీతి చర్యలపై నోరు మెదిపితే పార్టీకే నష్టం కల్గుతుందని స్థానిక నాయకులంతా మౌనంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో వైసీపీ నాయకులు రంగేగౌడ్, వాగేష్ తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌లో దాడి కేసులో

ముగ్గురు నిందితుల అరెస్ట్

పావగడ, జనవరి 17: కర్ణాటకలోని రాజవంతి గ్రామ సమీపంలో ని రిలాక్స్ రెస్టారెంట్‌లో సోమవారం జరిగిన దాడి కేసులో నిందితులైన మడకశిర మండలం ఎగువ అచ్చంపల్లికి చెందిన గోపాల్‌నాయక్, సురేష్‌నాయక్, ఆమిదాలగొందికి చెందిన సంజయ్‌కుమార్‌ను పావగడ పోలీసులు బుధవారం అరెస్టు చేసినట్లు తరలించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం రాత్రి రాజవంతి గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్, ఆర్ హొసకోటెకు చెందిన అశోక్, అనిల్ అనే యువకు లు మద్యం తాగడానికి రిలాక్స్ రెస్టారెంట్ వద్దకు వెళ్లారు. అక్కడ మడకశిర మండలం చందకచర్ల పంచాయతీ వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యమ్మ భర్త గోపాల్‌నాయక్ తన స్నేహితులు సురేష్‌నాయక్, సం జయ్‌కుమార్‌తో కలిసి బార్ వద్ద ఆ ముగ్గురు యువకులతో గొడవ పడ్డారు. మనోజ్‌కుమార్, అశోక్‌పై కోడికత్తులతో దాడిచేసి గాయపరిచారు. ఈ సంఘటనకు సంబంధించి నిందితులు గోపాల్‌నాయక్‌తో పాటు అతడి స్నేహితులను అరెస్టుచేసి జైలుకు పంపుతున్నట్లు పావగడ పోలీసులు తెలిపారు. గాయపడిన మనోజ్‌కుమార్, అశోక్‌ను తుమకూరు, బెంగళూరు విక్టోరియా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నప్పటికీ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది.

ఏడాది తిరక్కనే ధ్వంసమైన డ్రైనేజీ



ధ్వంసమైన డ్రైనేజీ

హిందూపురం అర్బన్, జనవరి 17: మున్సిపాలిటీ పరిధిలోని పూల కుంట ప్రాంతంలో గత వర్షాలకు ప్రధాన రహదారి వరువ తెగిపోయింది. దీంతో మరువపైన వంతెన నిర్మించి పక్కనే డ్రైను ఏర్పాటు చేశారు. అయితే ఏడాది కూడా తిరక్కుండానే పూలకుంట వద్ద బుడేన్‌సాబ్ బంగ్లా ఎదుటి భాగంలో హిందూపురం, లేపాక్షి ప్రధాన రహదారికి పక్కనే ఉన్న డ్రైను ధ్వంసమైంది. డ్రైను కూలి పోవడంతో ప్రమాదకరంగా మారింది. పొరపాటున రాత్రిపూట ఎవరైనా అటుగా వెళ్లారంటే అందులో పడే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

పావగడ, జనవరి 17: పట్టణంలో వెలసిన ఆంజనేయశెట్టి కల్యాణ మండపంలో బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆస్పత్రి, హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ తెలియజేశారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప తనయుడు వెంకటేశ్వర విద్యా సంస్థ కార్యదర్శి హెచ్‌వీ కుమారస్వామి ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈప్రాంతం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈశిబిరంలో జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, శంకర్ కంటి ఆస్పత్రి, హెల్ప్ సొసైటీ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. గురువారంఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కంటికి సంబంధించిన జబ్బులపై వైద్యశిబిరంలో చికిత్సలు పొందవచ్చని హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ తెలియజేశారు.

యువకుడి ఆత్మహత్య

తనకల్లు, జనవరి 17: మండలంలోని ఎగువతొట్లిపల్లి గ్రామానికి చెందిన భానుప్రకాష్(25) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. భానుప్రకాష్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. పని ఒత్తిడి భరించలేక ఇటీవల ఉద్యోగం వదిలి ఇంటికి వచ్చాడు. కాగా ఈనెల 3వ తేదీన మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే బెంగుళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం తండ్రి క్రిష్ణమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్త్రీశక్తి భవనానికి మోక్షమెన్నడో..?




శిథిలావస్థకు చేరిన స్త్రీశక్తి భవనం

అగళి, జనవరి 17 : మండల కేంద్రమైన అగళిలో స్త్రీశక్తి భవన నిర్మాణం ప్రారంభించి పదేళ్లయింది. నేటికీ పూర్తికాక అర్ధాంతరంగానే ఉండిపోయింది. మహిళలు మహిళా సంఘాల సమావేశాలు జరుపుకోవడం కోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రత్యే కంగా స్త్రీశక్తి భవనాలు నిర్మించారు. అగళిలో రూ.28లక్షల వ్యయంతో భవన నిర్మాణం చేపట్టినా నేటికీ పూర్తికాలేదు. దీంతో మహిళా సంఘం సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీర్ఘకాలికంగా నిర్మాణం పనులు నిలిచి పోవడంతో కిటికీలు, తలుపులు కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. అదేవిధంగా భవనం కూడా శిథిలావస్థలో ఉందన్నారు. అనేకమార్లు ప్రజాప్రతినిధులకు, జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. ఇంకా రెండు మూడేళ్లు ఇలాగే ఉంటే భవనం పూర్తిగా పడిపోతుందని, అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టి స్త్రీశక్తి భవనాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

22న వంటావార్పుతో నిరసన



విలేకరులతో మాట్లాడుతున్న ఇంతియాజ్

పెనుకొండ, జనవరి 17 : గోరంట్ల మండల పరిధిలోని పాలసముద్రం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన నాసిన్, బెల్ సంస్థలకు భూములిచ్చిన భూనిర్వాసి తులకు పరిహారం అందించడంతో పాటు పునరావాసం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ పేర్కొన్నారు. ఈ డిమాండ్‌తో ఈనెల 22న వంటా వార్పుతో 24గంటలు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఏపీఐఐసీ జోనల్ ఆఫీస్ వద్ద బుధవారం నాసిన్, బెల్ కంపెనీలకు భూములు ఇచ్చిన రైతులకు పరిహారంతో పాటు పునరావాసం కల్పించాలని ఆయన బుధవా రం మేనేజర్ మల్లికార్జునను కలిసి వివరించారు. అనంతరం ఇంతియాజ్ విలేక రులతో మాట్లాడుతూ... నాసిన్ కంపెనీని ప్రధాని మోదీతోపాటు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరై ఆట్టహాసంగా ప్రారంభించి వెనుతిరిగారు తప్ప భూములు ఇచ్చిన రైతుల గురించి మాట్లాడలేదన్నారు. నిర్వాసితులకు పరిహారం అందించాలని, పునరావాసం కల్పించాలని రెండు నెలల నుంచి ఏపీఐఐసీ అధికారుల వెంట పడుతున్నా కుంటిసాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ 22 లోగా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే 22న తుంగోడు, పాలసముద్రం గ్రామాల కు చెందిన భూనిర్వాసితులతో కలిసి వంటావార్పుతో 24గంటలు ధర్నా చేపడతామని హెచ్చరించారు. నాయకులు పెద్దన్న, గంగాధర్, నారాయణ, వెంకటరాముడు, భూ నిర్వాసితులు వెంకటరామిరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

గోరంట్ల, జనవరి 17: పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ ఆ కాలనీ మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కాలనీలో అధికంగా ఉన్నాయంటూ పంచాయతీ వారు దాదాపు ఒకటిన్నర నెల క్రితం పబ్లిక్ కొళాయలు తొలగించారన్నారు. దీంతో తాము తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు జనసేన నాయకులకు వివరించామన్నారు. వారు కాలనీలో తొలగించిన కొళాయిల ప్రాంతాలను పరిశీలించారని తెలిపారు. జనసేన ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టినట్లు కాలనీ మహిళలు తెలిపారు. దీంతో ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, పంచాయతీ గుమస్తా సాయి సజయ్ ఆందోళన కారుల వద్దకు వచ్చి వారితో చర్చించారు. కాలనీలో ఇష్టారాజ్యంగా కొళాయిలు ఏర్పాటు చేసుకోవడం, ఆ కొళాయిల నుంచి నేరుగా రబ్బరు పైపులతో ఇళ్లలోకి నీరు తీసుకోవడంతో ఇతర ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని తెలిపారు. దీంతో కొళాయిలు తొలగించినట్లు అధికారులు వారికి వివరించారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు మూడు ఇళ్లకు ఒక పబ్లిక్ కొళాయి వేయాలని డిమాండ్ చేశారు. కానీ ఐదు ఇళ్లకు ఒక కొళాయి వంతున గురువారం ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సంతోష్, సురేష్, వెంకటేష్, అనిల్, నగేష్, తిరుపాల్, మహిళలు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతికి తరలిరండి

టీడీపీ నాయకుల పిలుపు

పెనుకొండ, జనవరి 17 : మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు వర్ధంతిని పెనుకొండలో గురువారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, మండల కన్వీనర్ సిద్దయ్య పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తామన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తప్పక హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మడకశిరటౌన్: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల కు ఎన్‌టీఆర్ సర్కిల్‌లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారుతెలిపారు. ఎన్‌టీఆర్ అభిమానులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రొళ్ల: మండల కేంద్రంలో గురువారం 10 గంటలకు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, క్లస్టర్ ఇన్‌చార్జి సిద్దగంగప్ప తెలిపారు. మండలంలోని ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని

చౌడేశ్వరీ అమ్మవారికి జ్యోతుల ఉత్సవం



జ్యోతులు మోస్తున్న భక్తులు

హిందూపురం అర్బన్, జనవరి 17: పట్టణ పరిధిలోని చౌడేశ్వరీ కాలనీలో కులదేవత చౌడేశ్వరీ దేవికి స్థానికులు బుధవారం జ్యోతులు మోశారు. ప్రతి సంవత్సరం జనవరి మాసంలో గ్రామ దేవతకు జ్యోతులు మోయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే తెల్లవారు జాము నుంచి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌ను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. డప్పుల మోతలతో, మంగళ వాయిద్యాలతో భక్తులు జ్యోతులు మోశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాజు, స్థానిక కౌన్సిలర్ రామచంద్ర, గ్రామ పెద్దలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

తూకాల్లో తేడా వస్తే చర్యలు

లీగల్ మెట్రాలజీ అధికారి శివశంకర్



సిద్దగిరిలో ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారి శివశంకర్

మడకశిర రూరల్, జనవరి 17 : రేషన్ కార్డు లబ్ధిదారులకు బియ్యం పంపిణీలో తూకాల్లో తేడాలు వస్తే ఎండీయూ వాహన దారులపై చర్యలు తప్పవని హిందూపురం లీగల్ మెట్రాలజీ అధికారి శివశంకర్ పేర్కొన్నారు. ఆ బుధవారం మడకశిరతో పాటు మండలంలోని సిద్దగిరి, గుర్రపుకొండలో ఎండీయూ వాహనాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. సిద్దగిరి, గుర్రపుకొండ ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం తీసుకున్న లబ్ధిదారులకు తూకాల్లో తేడా గుర్తించామ న్నారు. దీంతో ఆ వాహన దారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా లీగల్ మెట్రాలజీ అధికారి మాట్లాడుతూ... రేషన్‌కార్డులో ఉన్నదాని కన్నా ఎండీయూ వాహనాల్లో తమకు బియ్యాన్ని తక్కువగా వేస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చా యన్నారు. సిద్దగిరి గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులకు రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహన దారులు చాలా తక్కువగా వేస్తున్నట్లు ఆ గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో తనిఖీలు చేపట్టామన్నారు. రేషన్ బియ్యం పంపిణీలో తూ కాల్లో తేడాలు వస్తే తక్షణం ఫోన్ నె.7989005014కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



మొరాయించిన ఆర్టీసీ బస్సు

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), జనవరి 17: పుట్టపర్తి-హిందూపురం ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు బుధవారం సోమందేపల్లి వద్ద మొరాయించింది. దీంతో అందులోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్లచ్ పనిచేయకపోవడంతో బస్సు ఆగిపోయినట్లు డ్రైవర్ ప్రయాణికులతో తెలిపారు. పుట్టపర్తి డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు హిందూపురానికి వెళ్తుండగా సోమందేపల్లి వద్ద ఉదయం 9.15కు మరమ్మతులకు వచ్చి ఆగిపోయింది. దీంతో ఆ బస్సు డ్రైవర్, కండక్టర్.. ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించి పంపారు.

జన సభల ద్వారా సమస్యల పరిష్కారం

పావగడ ఎమ్మెల్యే వెంకటేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ, జనవరి 17: ప్రతి పంచాయతీ లోనూ జన సభలు నిర్వహించి, వాటి ద్వారా ప్రతి సమస్యను అక్కడిక్కడే పరిష్కరించాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ సూచించారు. తాలూకాలోని మంగళవాడ, అరసికెరె గ్రామ పంచాయతీల్లో బుధవారం నిర్వహించిన జనసభల్లో ఎమ్మెల్యే, అధికారులు పాల్గొని మాట్లాడారు. ప్రతి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఏ సమస్యలు తలెత్తినా పీడీఓ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి సమస్యను అక్కడే పరిష్కరించుకోవడానికి సేవా కేంద్రాలుగా పంచాయతీ లు రూపుదిద్దుకోవాలని ఆయన తెలియజేశారు. అరసికెరె, మంగళవాడ ప్రాంతాల్లో మట్కా, జూదాలు ఒకప్పుడు అధికంగా జరిగేవని, ప్రస్తుతం నియంత్రించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధికంగా పొలాల్లో దారులు, వృద్ధుల పింఛన్లకు సంబంధించి అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ మరియు రెవిన్యూ అధికారులు, ట్రెజరీ అధికారులను ఎమ్మెల్యే అప్రమత్తం చేసి సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.